క్లుప్తంగా...

బయటకు వెళ్తే మాస్కులు ధరించండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 21 మందికి పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగెటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లే సమయాల్లో మాస్కులు ధరించాలని సూచించారు.

రాజీవ్ గృహకల్పలో అధికారుల పర్యటన

జగద్గిరిగుట్ట: పట్టణ ప్రగతిలో భాగంగా పలు శాఖల అధికారులు బుధవారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గృహకల్పవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. 49 బ్లాక్ వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. ఈ రోడ్డులో వాహనాలు వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అరికట్టడానికి స్పీడ్ బ్రేకర్లు వేయాలని ట్రాఫిక్ అధికారులను విన్నవించారు. చాలా రోజుల నుంచి కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. ప్యానల్ బోర్డ్ కొత్త ప్యానల్ బోర్డులను అమర్చాలని విద్యుత్ అధికారులను కోరారు. పార్కులను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన అధికారులు ఈ సమస్యలపై వీలైనంత తొందరగా పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం



భాస్కర్‌రావుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సీనియర్ సిటిజన్ సభ్యులు

నిజాంపేట్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ప్రగతినగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ బాసటగా నిలిచింది. ప్రగతినగర్‌కు చెందిన భాస్కర్‌రావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో విషయం తెలుసుకున్న అసోసియేషన్ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి చేపూరి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం భాస్కర్‌రావుకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ



సుభాష్‌నగర్: పల్లె పల్లెకు ఓబీసీ – ఇంటింటికి బీజేపీలో భాగంగా బుధవారం బహదూర్ పల్లి గ్రామంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓబీసీలకు అమలవుతున్న పథకాలను వివరిస్తూ పార్టీకి మద్దతు తెలపాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్‌రావు, లింగం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

దుండిగల్: చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా ఉన్న చెరువులో చేపలను పడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని పెద్ద కుమారుడు పోతారం రాకేశ్(23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా నాలుగు నెలల క్రితం శ్రీనివాస్ అకస్మాత్తుగా మృతి చెందాడు. అయితే మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్న శ్రీనివాస్ స్థానంలో రాకేశ్ తన తండ్రి వృత్తిని ఎంచుకుని కుటుంబానికి ఆసరాగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం తీసుకునే క్రమంలో తర్ఫీదు తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన రాకేశ్ తిరిగి రాలేదు. గత ఈత గాళ్ల సహాయంతో బుధవారం వెలికితీశారు. దుండిగల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ తరగతుల బహిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ తరగతులను రీసెర్చ్ స్కాలర్స్ బహిష్కరించారు. పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని బుధవారం పీహెచ్‌డీ విద్యార్థుల ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ క్లాసును బహిష్కరించి నినాదాలు చేస్తూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. పేద విద్యార్థులను పరిశోధన విద్యకు దూరం చేయాలని ఫెలోషిప్‌లు ఇవ్వకుండా, పీహెచ్‌డీ ఫీజులు పెంచారని ధ్వజమెత్తారు. ఫీజుల పెంపు విషయంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు.



ప్రగతినగర్‌లో రోడ్డు మధ్యలో బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై నాయుడు



రోడ్డు పక్కన వ్యాపారులకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యపై బుధవారం సాక్షిలో ప్రచురించిన 'జామ్ జామ్' ట్రాఫిక్ రద్దీ నియంత్రించాలి జల్దీ అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో ప్రధానంగా ట్రాఫిక్ జామ్ ఉన్న ప్రాంతాలను ట్రాఫిక్ సీఐ నాగేశ్ ఆధ్వర్యంలో గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో సమస్య పరిష్కారం కోసం పోలీసులు రంగంలోకి దిగారు. బుధవారం ఉదయం నుంచే ట్రాఫిక్ జామ్ అయ్యే ఏరియాల్లో చేపట్టాల్సిన చర్యలను గుర్తించి వేగవంతంగా స్పందించారు. ప్రగతినగర్‌లోని అన్ని సర్కిల్‌లలో వాహనాలు సక్రమంగా ప్రయాణం చేసేందుకు రోడ్డు మధ్యలో బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. దీంతో వాహనాలు ఒక క్రమ పద్ధతిలో వెళ్లేందుకు సులభతరం అయ్యింది.

ప్రధాన సర్కిల్‌ల లో ట్రాఫిక్ కానిస్టేబుల్..

బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లో ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రధాన సర్కిల్‌లలో ఉదయం సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించే విధంగా సీఐ నాగేశ్ ఏర్పాట్లు చేశారు. దీంతో సమస్య తీవ్రత చాలా వరకు తగ్గుంతుందని భావిస్తున్నారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయ్యే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించేందుకు సిబ్బందిని సిద్ధం చేస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.



ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు

రోడ్డు పక్కన వ్యాపారులపై చర్యలు..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఇరువైపుల చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. వీటిని నియంత్రించే పనిలో ట్రాఫిక్ పోలీసులు పడ్డారు. రోడ్డు పక్కన వ్యాపారాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించే విధంగా ఉండకూడదని పేర్కొన్నారు. వ్యాపారులకు కౌన్సెలింగ్ చేశారు. కొంత మందికి ఫైన్‌లు సైతం వేశారు.

అక్రమ పార్కింగ్‌లపై చర్యలు..

రోడ్డు పక్కన ఇష్టానుసారంగా పార్కింగ్ చేసే వాహనాలకు ఫైన్‌లు వేశారు. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయొద్దని సూచించారు. అదే విధంగా రోడ్డు పక్కన ఉన్న వ్యాపార సముదాయాలు తమ దుకాణాల ముందు వాహనాల పార్కింగ్ ఎలా జరుగుతుందనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు.

సమస్యను పరిష్కరిస్తాం



నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు చేపట్టాం. నిజాంపేట్‌లో ఎస్ఎన్‌డీపీ పనుల కారణంగా వాహనదారులకు కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాచుపల్లి, ప్రగతినగర్, వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, ఆర్ఆర్ఆర్ వైన్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉంది. గుర్తించిన ప్రాంతంలో తమ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా రోడ్డు పక్కన వ్యాపారుల కట్టడికి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల చొరవతో పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటాం. ఒక వారంలోపు పూర్తిస్థాయిలో ఈ సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ట్రాఫిక్ సీఐ నాగేశ్

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నడూ లేని విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా బుధవారం జీడిమెట్ల డివిజన్ ప్రసూననగర్ ఆయన పాదయాత్ర చేపట్టారు. స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరితగతిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఏ సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ సర్వేశ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలు సాంబశివరావు తదితరులు ఉన్నారు.



ప్రసూననగర్‌లో ప్రగతియాత్రలో భాగంగా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వివేకానంద్

నీటి కనెక్షన్ల చార్జీల పెంపుపై కాంగ్రెస్ ఆగ్రహం



నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట్: ఇష్టానుసారంగా నీటి కనెక్షన్ల చార్జీలు పెంచడంతో సామాన్య ప్రజలకు భారంగా మారుతోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో హాఫ్ ఇంచ్‌తో రెండు నీటి కనెక్షన్లు ఉన్న వారికి రూ.36,120, మూడు కనెక్షన్లు ఉన్న ఇళ్లకు రూ.53 వేలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు అందడంతో ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

- అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. 2021లో నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత హాఫ్ ఇంచ్ కనెక్షన్‌కు రూ.180 వసూలు చేశారన్నారు. తదనంతరం జలమండలికి అప్పగించిన అధికారులు 12 నెలల అనంతరం క్యాన్ నంబర్లకు అత్యధిక మొత్తంలో రుసుం చెల్లించాలని పేర్కొనడం సమంజసం కాదన్నారు. నీటి కనెక్షన్ల బిల్లులను తగ్గించాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, అరవింద్, రమేష్, అంజాద్, శ్రీశైలంయాదవ్, కొలన్ జీవన్‌రెడ్డి, వీరబాబు, మనీష్‌రెడ్డి, సురేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు బలహీన ప్రజలకు న్యాయం జరిగిందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి చెన్నారెడ్డినగర్, పంచశీల కాలనీల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. ముందుగా ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముద్రించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదన్నారు. పథకాలను ఆర్భాటంగా ప్రారంభిచడం, తదనంతరం గాలికొదిలేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. క్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ సువ్వారి శ్రీనివాస్, ఎల్లయ్య కాక, ఐఎన్‌టీయూసీ నాయకుడు అమర్‌బాబు, మాజీవార్డు సభ్యుడు శివకుమార్, హమ్మిరెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్, రాహుల్, ప్రశాంత్‌రెడ్డి, కుమారి, లలిత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

పరికి చెరువు పూడ్చి అక్రమ గదుల నిర్మాణం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్ సమీపంలో ఉన్న పరికి చెరువుని పూడ్చి అక్రమంగా గదులు నిర్మాణం చేపడుతున్నారు. భూదేవి హిల్స్ నుంచి చెరువు వరకు సుమారు 15 విద్యుత్ స్తంభాలు కూడా అమర్చి కబ్జాలు చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు, సీపీఐ నాయకులు కూడా ఇటీవలే ఎమ్మార్వోకి ఫిర్యాదు చేశారు. కాని అధికారుల మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విశేషం. ఓ వైపు చెరువుల సుందరీకరణ పేరుతో ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే ఇక్కడ మాత్రం చెరువునే కనిపించకుండా చేస్తున్నారు కబ్జాదారులు. ఇప్పటికైనా అధికరులు ఈ చెరువు సమీపంలోని కబ్జాలను అరికట్టకపోతే పూర్తిగా అన్యాక్రాంతమయ్యే ఆస్కారం ఉంది. ఈ విషయమై ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ఈ కబ్జాలపై ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. తప్పకుండా వీలైనంత తొందరగా చర్యలు చేపట్టి క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల విషయమై జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిటీ శానిటేషన్ ప్లాన్ రూపకల్పన, యానిమల్ కేర్ సెంటర్, మోడ్రన్ ధోబీఘాట్, ఎఫ్ఎస్‌టీపీ, వైకుంఠధామం నిర్మాణం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొక్కలు నాటే కార్యక్రమాలపై చర్చించారు. అదే విధంగా దూలపల్లి పరిధిలోని తుమార్ చెరువు, ఊర చెరువుల్లో మట్టి పోసి కబ్జాకు యత్నిస్తున్న విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి అభిషేక్ అగస్త్య మట్టిని తొలగించాల్సిందిగా దుండిగల్ తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ డీఈలకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు అడిషనల్ కలెక్టర్‌తో సమావేశమైన వారిలో ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో సమావేశమైన దుండిగల్ మున్సిపల్ చైర్మన్

సమస్యలను పరిష్కరిస్తాం

- పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో అధికారులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని కమ్యూనిటీ హాలులో బుధవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి ఉమారాణి, జలమండలి మేనేజర్ పూజిత, విద్యుత్ శాఖ ఏఈ శంకర్‌నాయక్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనాథ్, కార్తీక్‌గౌడ్, నీలగిరి, రాజిరెడ్డి, శ్రీనివాస్, రజాక్, వెంకట సాయి, నవీన్, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

మమత ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

నిజాంపేట్: ట్రాకియోసోఫేగియల్ ఫిస్టులాతో బాధపడుతున్న యువకుడికి బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మమత ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. తరచూ న్యూమోనియాతో పాటు గ్యాసిక్ సమస్యతో బాధపడుతున్న యువకుడు (17) మమత ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. దీంతో వైద్యులు అతని ఆరోగ్య సమస్యపై డయాగ్నైజ్ చేయగా ట్రాకియో సోఫో ఫేజియల్ ఫిస్టులా ఉన్నట్లు గుర్తించారు. కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ వెంకట్‌విజయ్, పీడియాట్రిక్ డాక్టర్ గుంజన్ షూర్, ఎనస్తీషియన్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ప్రశాంతిల ఆధ్వర్యంలో విజయవంతంగా సర్జరీ పూర్తి చేశారు. ప్రస్తుతం బాలుడు పూర్తిగా కొలుకున్నాడన్నారు. ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాశాడని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న మమత ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ చంద్రశేఖర్

మనూ 'ఐఎంసీ' పనితీరు భేష్

- వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మనూలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్' (ఐఎంసీ) పనితీరు భేషుగ్గా ఉందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐఎంసీ ద్వారా 'మనూ' నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా నిర్మించిన రెండు చిత్రాలు ఇంటర్ యూనివర్శిటీ కేంద్రమైన కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(సీఈసీ) నిర్వహించిన సీఈసీ యూజీసీ ఎడ్యుకేషనల్ వీడియో ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రాలుగా ప్రశంసలు అందుకున్నాయి. ఈ నేపథ్యంలో వైస్‌చాన్స్‌లర్‌ను ఆయన కార్యాలయంలో ఐఎంసీ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ వారిని అభినందించారు. ఐఎంసీ రూపొందించిన చిత్రాలలో మొదటి చిత్రం 'అల్లప్రావి'కు ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ విభాగంలో ఉత్తమ చలనచిత్ర అవార్డును అందుకుంది. అదేవిధంగా 'రెండవ చిత్రమైన 'పాలిమర్' ది ప్రామిస్ ఆఫ్ పీడీఎంఎస్' ఉత్తమ చిత్రం/డాక్యుమెంటరీ అవార్డు కేటగిరి కింద సైటేషన్‌కోసం సిఫార్సు చేయబడింది.



వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసిన ఐఎంసీ సెంటర్ ప్రతినిధులు

ఘనంగా ఎంఎల్ఆర్ఐటీ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల 18వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు అధిక సంఖ్యలో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే వందలాది తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. అత్యాధునిక సదుపాయాలతో విద్యార్థులకు విద్యాబోధన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి అనుశ్రేయారెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, వివిధ విభాగ అధిపతులు అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఉద్యోగ నియమాకాలు చేపట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌టీపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశానుసారం టీ–సేవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభయ్ అగస్త్యకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు జారీ చేయాలన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉద్యోగ ఖాళీలు ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం వేలల్లో సైతం నోటిఫికేషన్లు వేయడం లేదన్నారు. దీంతో నిరుద్యోగులు వయస్సు మించిపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెపోగు విజయరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పావని, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల భాస్కర్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రటరీ కొండా అప్పారావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి, కీసర మండల అధ్యక్షుడు ఉద్దెమర్రి సోమన్న, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ జార్జ్, ఉప్పల్ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు రుపేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భాషా తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ అగస్త్యకు వినతి పత్రం అందజేస్తున్న సురేష్‌రెడ్డి

జీవో.14, 60లను అమలు చేయాలి



వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

రంగారెడ్డినగర్: వేతనాల పెంపు జీవో 14, 60లను అమలు చేయాలని బుధవారం జలమండలి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాలుగా జీతాల పెంపుకోసం అర్జీలు పెట్టుకుంటూ వస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈనెల 20వ తేదీలోపు కార్మికులకు అనుకూలంగా బోర్డు నిర్ణయం తీసుకోకపోతే యూనియన్ నిర్ణయం ప్రకారం సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన జీఎం ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మరమ్మతులు చేసినా మళ్లీ లీకేజీలు

- వృథాగా పోతున్న గోదావరి జలాలు
- నాసిరకం పనులు చేపడుతున్నా పట్టించుకోని వైనం
- అధికారులు మామూళ్ల మత్తులోనే ఉంటున్నారని ఆరోపణలు

చింతల్: నాసిరకం పనుల కారణంగా రోజురోజుకు వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా జలమండలి అధికారుల్లో చలనం రావడం లేదంటూ వాహనదారులు ఆరోపిస్తున్నారు. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని రోడామేస్త్రీనగర్‌కు వెళ్లే దారిలో తాగునీటి ఓపెన్ వాల్వ్‌కు మూడు నెలలుగా లీకేజీ ఏర్పడి నిరంతరంగా గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. ఇప్పటికి పలుమార్లు మరమ్మతులు చేపట్టిన మరుసటి రోజే లీకేజీ ఏర్పడడం ఇక్కడ షరా మామూలుగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- మూడు నెలల కాలంగా మూడుసార్లు మరమ్మతులు చేపట్టిన లీకేజీ తలెత్తడంతో రోడ్లపై నీరు పారుతుండడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల్లో మూడుసార్లు మరమ్మతులు చేపట్టిన లీకేజీని అరికట్టకపోవడంపై అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ చూసినా పైప్ లైన్ లీకేజీలు, మురుగు ప్రవాహాలు, మూతల్లేని మ్యాన్‌హోళ్లే కనిపిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. జలమండలి అధికారులు కేవలం కొత్తగా వచ్చే కనెక్షన్లపైన ఆధారపడుతూ మామూళ్ల మత్తులో పరిపాలన గాలికి వదిలేశారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



రోడామేస్త్రీనగర్‌లో మూడు నెలలుగా రోడ్డుపై పారుతున్న గోదావరి జలాలు